10న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో భవిష్య నిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.ఎటుంత్ తెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్ రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గాంధీ



ఎమ్మెల్యే గాంధీని కలిసిన నల్లగండ్ల హుడా కాలనీవాసులు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల హుడా కాలనీలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తెలిపారు. నల్లగండ్ల హుడా కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులు ఎమ్మెల్యే నివాసంలో గాంధీని కలిశారు. అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, 100 ఫీట్ల రోడ్డులో స్ట్రీట్ లైట్‌లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని కోరగా గాంధీ మాట్లాడుతూ త్వరలో నల్లగండ్ల హుడా కాలనీలో పర్యటిస్తానని చెప్పారు. అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీకాంత్, కిషోర్, రాజేశ్వర్‌రావు, శ్రీరామ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.





చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద వాహనాల రద్దీ

యూటర్న్‌లు.. ఇబ్బందులు

జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు.. ట్రాఫిక్ కష్టాలు

హఫీజ్‌పేట్: చందానగర్ జాతీయ రహదారిపై యూటర్న్‌లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జాతీయ రహదారిలో నిత్యం ట్రాఫిక్ జామ్‌లు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు సిగ్నళ్లను మూసి వేసి యూటర్న్‌లను ఏర్పాటు చేశారు. దీని వల్ల కొంత మేర ఉపశమనం కలిగినప్పటికీ యూ టర్న్‌ల వద్ద తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారులపై మలుపులు ఉండరాదనే నియమాలు ఉన్నప్పటికీ.. చందానగర్, గంగారం ప్రాంతాలు నగరానికి చేరువుగా ఉండడంతో ఇక్కడ యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఇవి ట్రాఫిక్ జామ్‌లకు ఆలవాలంగా మారాయి. నిత్యం ఐటీ ఉద్యోగులు ఉదయం, సాయంత్రం సమయాలలో భారీగా రాకపోకలు చేస్తుంటారు. దీంతో ట్రాఫిక్ నిలిచిపోతోంది. కాగా పలు రహదారులపై పాదచారులు జీబ్రా క్రాసింగ్‌తో సాఫీగా రోడ్డు దాటుతున్నారు. కానీ సిగ్నళ్లు మూసివేసినప్పటి నుంచి పాదచారులు రోడ్డు దాటాలంటే అష్టకష్టాలు పడుతున్నారు.

- చందానగర్, గంగారం ప్రాంతాలలో ఉన్న యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ జాంలు తీవ్రంగా ఉంటున్నాయి.
- జాతీయ రహదారి కావడంతో సాయంత్రం పూట ట్రాఫిక్ కష్టాలు వర్ణణాతీతం.
- పాదచారుల కోసం జీబ్రా క్రాసింగ్‌తో కూడిన సిగ్నల్‌ను ఏర్పాటు చేయాలి.
- ట్రాఫిక్ సమస్య ఏర్పడే యూ టర్న్‌లను మూసివేయాలి .
- ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు ప్రత్యామ్నాయ రోడ్లు గుర్తించాలి.
- నిత్యం యూ టర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.





మలుపుల వద్ద ప్రమాదాలు



చందానగర్ నుంచి గంగారం వరకు మూడు యూటర్న్‌లు ఉన్నాయి. ఉదయం, సాయంత్రం వేళలో ట్రాఫిక్ తీవ్రంగా ఉంది. రద్దీ సమయంలో పాదచారులకు ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ జామ్‌లు నెలకొనకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– శేఖర్, చందానగర్

అవసరమైన చోట సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



చందానగర్ జాతీయ రహదారిపై అవసరం ఉన్న చోట సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి. యూ టర్న్‌ల వల్ల కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గినా ప్రమాదాలకు దారితీస్తుంది. –అశోక్, చందానగర్

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో జగదీశ్వర్ హస్తకళా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన నేషనల్ సిల్క్ ఎక్స్‌పో–2024ను ఎగ్జిబిషన్‌ను నటి, యాంకర్ భార్గవి ప్రారంభించారు. ప్రతిఒక్కరూ చేనేతకారులను ప్రోత్సహించాలని, నగర ఫ్యాషన్ ప్రియులను ఈ ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంటుందన్నారు. ఈ వస్త్ర ప్రదర్శనలో దేశంలోని పలు రాష్ట్రాల నుంచి సిల్క్, కాటన్, డిజైనరీ చీరలతో పాటు పలు ఫ్యాన్సీ వస్తువులను సుమారు 70 స్టాల్స్‌లో ప్రదర్శిస్తున్నారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశామని నిర్వాహకుడు జయేష్‌గుప్తా తెలిపారు. వస్త్ర ప్రదర్శన ఈ నెల 14 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (1998–99) పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఆదివారం శేరిలింగంపల్లి హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు చెన్నయ్య, ప్రభాకర్‌రెడ్డి, యాదగిరి, లోకేష్, లక్ష్మీ, జయంత్‌కుమార్, స్వర్ణలీల, వసంత లక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు. 25 ఏళ్ళనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరస్పరం వివరాలను అడిగి తెలుసుకున్నారు.

యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో పాల్గొన్న డాక్టర్లు

మాదాపూర్: భారతదేశంలో దక్షిణాన ఇన్‌ఫ్లమేటరీ పేగు వ్యాధి వేగంగా పెరుగుతోందని యశోద గ్రూప్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.రావు పేర్కొన్నారు. మాదాపూర్‌లోని యశోద హాస్పిటల్‌లో ఆదివారం ఇన్‌ఫ్లమేటరి బొవెల్ డిసీజ్ (ఐబిడి) పురోగతులపై అంతర్జాతీయ సదస్సు, లైవ్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో ప్రపంచం నలుమూలల నుంచి 300 మందికి పైగా వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో దశాబ్దకాలంగా ఐబీడీ కేసులు గణనీయంగా పెరిగాయన్నారు. రెగ్యులర్ లైఫ్‌స్టైల్‌తో పాటు ఒత్తిడిని తగ్గించుకోవడం వల్ల సమస్యను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కిరణ్‌పెద్ది, డాక్టర్ చార్లి, డాక్టర్ దీపక్ పాల్గొన్నారు.

హోంగార్డు పాదయాత్ర.. సన్మానించిన ఎమ్మెల్యే



హోంగార్డు కృష్ణసాగర్‌ను సన్మానించిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

రాయదుర్గం: జోగులాంబ దేవాలయం నుంచి హైదరాబాద్ గచ్చిబౌలి వరకు నడుచుకుంటూ వచ్చిన హోంగార్డు చీర్ల కృష్ణసాగర్‌ను రాష్ట్ర హోంగార్డుల సంఘం గౌరవ అధ్యక్షుడు, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సన్మానించారు. పాదయాత్ర చేస్తూ గచ్చిబౌలిలోని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నివాసానికి రాగా ఆయన కృష్ణసాగర్‌ను సన్మానించి ఇంటి ప్రాంగణంలో మొక్క నాటారు. గద్వాల, వనపర్తి, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి పాదయాత్ర చేస్తూ నగరానికి వచ్చారు. తెలంగాణ హోంగార్డ్స్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కొత్వాల్ దయానంద్, ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు దేవేందర్, పోతులపల్లి కిషోర్ సాగర్, చిలుక కుమార్, గోపాల్ పాల్గొన్నారు.

గుల్‌మొహర్‌పార్కు కాలనీలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం



ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, కొమిరిశెట్టి సాయిబాబా

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీలో హెచ్‌ఎస్‌బీసీ ఇండియా, ది సోషల్ యునైటెడ్ వే ముంబై వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబలతో కలిసి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కాలనీవాసులతో పాటు పార్కుకు వచ్చే వారికి ఉపయోగపడుతుందన్నారు. గుల్‌మొహర్‌పార్కు కాలనీవాసులు గ్రీనరీ అభివృద్ధి, పార్కు నిర్వహణలో ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కాలనీ అధ్యక్షులు షేక్ ఖాసీం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామియాదవ్, నల్లగండ్ల హుడా కాలనీ అధ్యక్షులు మంత్రిప్రగడ సత్యనారాయణరావు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కాలనీ ప్రధాన కార్యదర్శి ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు మోహన్‌రావు, రఘురాం, ప్రభాకరాచారి, సభ్యులు పెంటోజీ, శేఖర్‌రావు, రాణి విక్టోరియా, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్రీధర్‌రెడ్డి, కృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర





ఆల్విన్‌కాలనీ: హరే రామ.. హరే కృష్ణ, జై జగన్నాథ్ అనే నామస్మరణతో ముంబై జాతీయ రహదారి మార్మోగింది. ప్రజాప్రతినిధులు, సంఘాల నేతలు, భక్తులు రథం ముందు బంగారు చీపురుతో ఊడ్చి రథయాత్రను ప్రారంభించారు. కోలాటం, నృత్యం చేస్తూ.. జగన్నాథుడి రథాన్ని లాగుతూ భక్తులు తన్మయత్వం చెందారు. జగన్నాథ రథయాత్రకు మంగళ హారతులు ఇస్తూ మహిళలు స్వాగతం పలికారు. రాధాకృష్ణుల వేషధారణలో పిల్లల సందడి చేశారు. డప్పు వాయిద్యాల నడుమ సాగిన రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతర్జాతీయ ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ డైరెక్టర్ మహా శృంగదాస్ ఆధ్వర్యంలో ఊరేగింపు కొనసాగింది. హైదర్‌నగర్‌లోని విజయలక్ష్మి దేవాలయం ప్రాంగణం నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ కాలనీ, భాగ్యనగర్‌కాలనీ, కూకట్‌పల్లి మెట్రో వరకు రథంపై జగన్నాథ, బలభద్ర, సుభద్రలను ఊరేగించారు. అనంతరం కూకట్‌పల్లి మెట్రో వద్ద ఉన్న ఫంక్షన్‌హాల్‌లో భక్తులకు స్వామివారి మహా ప్రసాదాన్ని అందజేశారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మై హోమ్ అంకుర కాలనీలో శుభ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో జగన్నాథ స్వామిని ఊరేగించారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ తెల్లాపూర్ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అలరించిన ఆరుషి నృత్య ప్రదర్శన



మాదాపూర్: ఆరుషి నాగభైరవ కూచిపూడి నృత్యప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో ఆదివారం ప్రముఖ నాట్య గురువులు నీలిమ సమక్షంలో ఆరుషి కూచిపూడి అరంగ్రేట్రం చేసింది. భామాకలాపం, తరంగం, అన్నమాచార్య కీర్తనలు, తిల్లాన, గోవిందనామాలను నృత్యరూపంలో ప్రదర్శించి అలరించారు. కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం శ్వాసకోశ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహం, బీపీ, చర్మ, దంత, కాళ్లు, నేత్రాలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి ఉచితంగా మందులను అందజేశారు.

ముగిసిన నృత్యోత్సవాలు



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సృజన జాతీయ నృత్యోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన మారుతీ డ్యాన్స్ అకాడమీ శిష్యబృందంచే సత్రియ బెదాన్త వికాస్ దత్త, భరతనాట్యం త్రిష్ణ వృందాదుబాయ్, , కథాకళి కొత్తకల్ నందకుమారన్ నాయర్ కేరళ, కథక్ అర్చన మిశ్ర, రాజస్థానీ నృత్యం శ్రీకాంత్ బృందం,ఒడిస్సీ పట్నాయక్, గెడ్ నృత్యం, టిక్రం బృందాలు తమ ప్రదర్శనలతో అలరించారు.



కార్పొరేటర్ పర్యటన



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆదివారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సీసీ రోడ్డు నిర్మాణ సమయంలో స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా, పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. వర్షపు నీరు రోడ్లపై నిల్వకుండా అవసరమైన చర్యలు తీసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ జి.మోహన్‌గౌడ్, నాయకులు కృష్ణారెడ్డి, కాలనీవాసులు శర్మ, మల్లేష్, ప్రీతం, నిశాంత్, శ్రీలక్ష్మీ తదితరులు పాలొన్నారు.



వర్షం వస్తే.. ఇదీ పరిస్థితి

వినాయక్‌నగర్‌కాలనీ ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచిపోతోంది. కనీసం అడుగు కూడా పెట్టలేని దుస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఆదివారం శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పరిస్థితిని పరిశీలించారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతను పూడ్చి నీరు నిలవకుండా రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామని అసోసియేషన్ ప్రతినిధులు స్థానికులకు హామీ ఇచ్చారు. – రాయదుర్గం

అయ్యప్ప జేఏసీ ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న అరుణ్ గురుస్వామి

హఫీజ్‌పేట్: చందానగర్ గంగారంలోని పీజేఆర్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో రాష్ట్ర అయ్యప్ప జేఏసీ ఆత్మీయ సమావేశం ప్రసాద్‌రావు గురుస్వామి సౌజన్యంతో అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షులు బుచ్చిరెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా అరుణ్ గురుస్వామి, ప్రసాద్‌రావు గురుస్వామి, 11 జిల్లాల నుంచి సుమారు 250 మంది గురుస్వాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా అరుణ్ గురుస్వామి మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఇరుముడులతో వెళ్తున్న భక్తుల కు కేరళ ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రవి, సత్యనారాయణ, రామచంద్రరావు, శ్రీనివాస్, జ్యోతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘సీతంబాయి పొలం’ కథల సంపుటి ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న రచయితలు, సీనియర్ జర్నలిస్టులు

రాయదుర్గం: తెలంగాణకు చెందిన ప్రముఖ కథా రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఏఎం అయోధ్యరెడ్డి తాజా కథల సంపుటి ‘సీతంబాయి పొలం’ పుస్తకావిష్కరణ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. గచ్చిబౌలి డివిజన్ గోపన్‌పల్లిలోని జర్నలిస్టుకాలనీలో సొసైటీ కార్యాలయం హాలులో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత, సీనియర్ పాత్రికేయుడు ఏఎన్ జగన్నాథశర్మ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. సమావేశానికి హాజరైన అయోధ్యరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత స్పీడ్ యుగంలో కథలు చదివే పాఠకులు కరువయ్యారని, మరీ ముఖ్యంగా ఈ తరం యువత, పిల్లలు తెలుగు సాహిత్యానికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . కార్యక్రమంలో పలువురు సీనియర్ కవులు, రచయితలు, కార్టూనిస్టులు, జర్నలిస్టులు వేణుగోపాలస్వామి, ప్రతాప్‌రెడ్డి, గురువారెడ్డి, లక్ష్మణ్‌రావు, రమణజీవి, సురేంద్ర, నర్సింమ్, తల్లావజ్ఝల లలితాప్రసాద్, తిరుమలగిరి సురేందర్, పెద్దిరాజు, జగన్, హన్మంతురావు, దొర్బాల బాలశేఖరశర్మ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి 14వ వార్డులో రోడ్డు విస్తరణకు సహకరించిన గ్రామస్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు కౌన్సిలర్ శంషాబాద్ రాజు. ఆదివారం 14వ వార్డులో సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు.

కోటి కుంకుమార్చన

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకరమఠంలో ఆదివారం కోటి కుంకుమార్చన కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగుతుందని ఆలయ ధర్మకర్త సిఎస్ఆర్ మూర్తి తెలిపారు.

కాలనీల్లో వసతుల కల్పనకు కృషి

శేరిలింగంపల్లి: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ నవోదయ కాలనీలో ఆదివారం ఆయన పర్యటించారు. ఆ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో నాయకులు మన్నేపల్లి సాంబశివరావు, సురేష్, భరత్, జయద, వినయ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

